పేదింటి బిడ్డలు.. క్రీడల్లో మెరికలు

- క్రీడల్లో రాణిస్తున్న నీలకంఠాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు
- 20 మంది రాష్ట్రస్థాయి పోటీలకు.. ఇద్దరు జాతీయస్థాయికి ఎంపిక
- అన్ని విధాలా ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అండర్ –19 రైఫిల్ షూటింగ్ విభాగంలో...
సంజన్న, గిరిక, యమున, గణేష్, మంతేజ్

అండర్ –17 రైఫిల్ షూటింగ్ విభాగంలో...
రజిత, తేజస్విణి, శిరీష, బాబు, రాజు, మహేష్, భరత్, ప్రజ్వల

అండర్ – 14 రైఫిల్ విభాగంలో...
అనిత, కావ్య, మౌనిక, వివేక్, కౌషిక్

అండర్– 19 షూటింగ్ బాల్ విభాగంలో...
భరత్‌నాయక్, పవన్ నాయక్

రైఫిల్ షూటింగ్‌లో జాతీయస్థాయికి ఎంపికైన వారు..
అండర్-19లో గణేష్ , అండర్ -14లో కావ్య


రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న నీలకంఠాపురం విద్యార్థులు


రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలో పాల్గొన్న నీలకంఠాపురం విద్యార్థులు (ఫైల్)

వారంతా జిల్లాలో మారుమూల గ్రామానికి చెందిన విద్యార్థులే. అందరూ పేదలు, వ్యవసాయ నేపథ్యం ఉన్న కుటుంబాలకు చెందిన వారు. పేరొందిన గురువుల దగ్గర శిక్షణ తీసుకోలేదు. ఉన్న సదుపాయాలను చక్కగా సద్వినియోగం చేసుకొని రైఫిల్ షూటింగ్‌లో రాణిస్తున్నారు. ఇప్పటికే జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపారు. జాతీయస్థాయికి ఎంపికయ్యారు.

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చివేసి విద్య, క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేశారు. చదువుకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో క్రీడలకు కూడా అంతే ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులు కూడా వివిధ క్రీడ పోటీల్లో రాణిస్తున్నారు.

మారుమూల గ్రామమైనా...

మడకశిర మండలం నీలకంఠాపురం కర్ణాటక రాష్ట్ర సరిహద్దు గ్రామం. ఇక్కడి నుంచి కేవలం మూడు కిలో మీటర్ల దూరంలోనే కర్ణాటక రాష్ట్రంలోకి ప్రవేశించవచ్చు. నీలకంఠాపురం గ్రామం జిల్లాలో మారుమూల గ్రామమైనప్పటికీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మాత్రం చదువుతో పాటు క్రీడల్లోనూ చక్కగా రాణిస్తున్నారు. ప్రస్తుతం 8, 9, 10 తరగతులు చదువుతున్న 20 మంది విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో జిల్లా స్థాయిలో అండర్–14, 17, 19 రైఫిల్ షూటింగ్, షూటింగ్ బాల్ విభాగల్లో సత్తా



చాటి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన ఇద్దరు క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు.

పోలీసు ఉన్నతాధికారి కావడమే లక్ష్యం



ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగానే రోజూ పాఠశాలలో పీఈటీ ఆధ్వర్యంలో రైఫిల్ షూటింగ్‌లో శిక్షణ తీసుకున్నాను. ఆయన ఎంతో స్ఫూర్తి నింపడంతో రైఫిల్ షూటింగ్‌పై ఆసక్తి పెంచుకుని జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాను. రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఉన్నత చదువులు చదివి పోలీస్ ఉన్నతాధికావాలన్నదే నా లక్ష్యం. – గణేష్, 9వ తరగతి , నీలకంఠాపురం

జాతీయస్థాయిలో రాణిస్తా...



రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ఎంతో ప్రోత్సాహమిస్తోంది. పీఈటీ శిక్షణతో రైఫిల్ షూటింగ్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటి జాతీయస్థాయిపోటీలకు అర్హత సాధించడంతో చాలా సంతోషంగా ఉంది. ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగి కావాలన్నదే నా కోరిక. జాతీయ స్థాయి పోటీల్లో రాణించేందుకు పీఈటీతో శిక్షణ తీసుకొంటున్నా. – కావ్య, 8వ తరగతి, నీలకంఠాపురం

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇస్తూ వారిలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ఇప్పటికే నీలకంఠాపురం ఉన్నత పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్‌కు ఎంపికై ఉత్తమ ప్రతిభ కనపరిచారు. గణేష్, కావ్య విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. – రాజేష్ , వ్యాయామ ఉపాధ్యాయుడు, నీలకంఠాపురం

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ


నారాయణరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మంగమ్మ

పరిగి: మండలంలోని శాసనకోటకు చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నేత, డీలర్ నారాయణరెడ్డి శనివారం గుండెపోటుతో మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. ఈ నేపథ్యంలో ఆదివారం నారాయణరెడ్డి భౌతికకాయం వద్ద ఎమ్మెల్సీ మంగమ్మ పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు డివిజన్‌స్థాయి 'స్పందన'

అమరాపురం: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సోమవారం ఉదయం 9:30 గంటలకు డివిజన్‌స్థాయి స్పందన కార్యక్రమాన్ని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి డివిజనల్‌స్థాయి అధికారులతో పాటు మండలంలోని అన్ని శాఖల మండలస్థాయి అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 1:30 గంట వరకూ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్యాయత్నం

హిందూపురం అర్బన్: హిందూపురం రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం పట్టణానికి చెందిన ముబారక్ (26) అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రైలు కింద పడటంతో ముబారక్ తన రెండు కాళ్లను పోగొట్టుకున్నాడు. స్థానికులు 108కు సమాచారమిచ్చి ఆస్పత్రికి తరలించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ


పరిశీలిస్తున్న డీఈఓ మీనాక్షి

పెనుకొండ రూరల్: పట్టణంలోని వివిధ కేంద్రాల్లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించారు. డీఈఓ మీనాక్షి ఆయా కేంద్రాలను తనిఖీ చేశారు. మొత్తం నాలుగు సెంటర్లలో 1049 మంది విద్యార్థులకు గాను 1025 మంది పరీక్షకు హాజరయ్యారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాలు పాటు ప్రభుత్వం స్కాలర్‌షిప్ మంజూరు చేస్తుందని డీవైఈఓ రంగస్వామి తెలిపారు.

బస్సు – కారు ఢీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని యూ.రంగాపురం గ్రామం వద్ద ఆదివారం కేఎస్ఆర్టీసీ బస్సు ఇనోవా కారు ఢీ కొన్న ఘటనలో కారు, కేఎస్ఆర్టీసీ బస్సు దెబ్బతిన్నాయి. తుముకూరు నుంచి పావగడకు వస్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు... మడకశిర నుంచి వస్తున్న కారు యూ.రంగాపురం వద్ద ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


నేహ

పావగడ: జిల్లా స్థాయి ప్రతిభా కారంజి చిత్రలేఖనం పోటీల్లో స్థానిక గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థిని నేహ ఎస్ఎన్ ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. మధుగిరిలో జరిగిన జిల్లా స్థాయి ప్రతిభా కారంజి పోటీల్లో నేహ ప్రతిభ చూపింది. అదే పాఠశాలకు చెందిన యశస్ కే మూర్తి,భావన జి క్విజ్ పోటీల్లో ద్వితీయ స్థానం, చర్చా పోటీల్లో మహేశ్వరి ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. కోటగుడ్డ సహన కాన్వెంట్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని సుశ్మిత హిందీ ఉపన్యాసంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే 9వ తరగతి విద్యార్థిని గ్రీష్మ సంస్కృత పఠనం పోటీల్లో ద్వితీయ స్థానం, కన్నడ ఉపన్యాసం పోటీల్లో గీతా లక్ష్మి తృతీయ స్థానం సాధించింది.

యూటీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక


ప్రతిజ్ఞ చేస్తున్న యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీ సభ్యులు

హిందూపురం టౌన్: యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీను ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని సప్తగిరి కళాశాలల్లో యూటీఎఫ్ జిల్లా 2వ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేవీవీ నాయకులు ఈటీ రామ్మూర్తి, రామకృష్ణ, రైతు సంఘం నాయకులు వెంకటరామిరెడ్డి, ఎన్‌జీఓ అధ్యక్షుడు నరసింహుడు, ఓపీడీఆర్ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, గౌరవాధ్యక్షుడిగా భూతన్న, సహాధ్యక్షుడిగా జీహెచ్ బాబు, సీతాలక్ష్మీ, కోశాధికారిగా శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్‌గా మారుతి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా మహంతేశ్వర్‌తో పాటు 8 మందిని జిల్లా కార్యదర్శులుగా నియమించారు. అనంతరం ప్రజా నాట్యమండలి కళాకారులు ఉద్యమ గీతాలు ఆలపించగా, యూటీఎఫ్ నాయకుడు నబీరసూల్ మ్యాజిక్ షో నిర్వహించారు.

కోటిలింగాలకు ప్రత్యేక బస్సులు


కోటిలింగాల దర్శనానికి బయలు దేరుతున్న ఆర్టీసీ సర్వీసులు

హిందూపురం: హిందూపురం ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం, కోటిలింగాల ఆలయల దర్శనాలకు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో సహాయ మేనేజర్ హంపన్న తెలిపారు. ఆదివారం ఉదయం కోటిలింగాల దర్శనానికి మూడు బస్సులు, సాయంత్రం అరుణాచలానికి రెండు బస్సు సర్వీసులను ప్రారంభించామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్: 9440834715ను సంప్రదించాలన్నారు.

బస్సుయాత్ర విజయవంతం చేయండి


అమరాపురం: మాట్లాడుతున్న మడకశిర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి

అమరాపురం: నియోజకవర్గ కేంద్రమైన మడకశిర పట్టణంలో ఈనెల 7వ తేదీన నిర్వహించే సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్, ఎమ్మెల్యే తిప్పేస్వామి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మడకశిరలో 7న నిర్వహించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సామాజిక సాధికార బస్సుయాత్రకు మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన నవరత్నాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందన్నారు. దీంతో ఐకమత్యంతో అందరూ యాత్రకు తరలిరావాలని పిలుపునిచ్చారు. పంచాయతీల వారీగా ఎంతమంది వస్తారు? తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వాకర్క, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ నళిని, డైరెక్టర్లు లక్ష్మీదేవి, రాజేశ్వరి, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, వైస్.ఎంపీపీలు క్రిష్ణమూర్తి, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం ఎమ్మెల్యే తిప్పేస్వామి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్ సమావేశయ్యారు. 7న జరగనున్న బస్సుయాత్ర విజయవంతంపై పలు సూచనలు, సలహాలిచ్చారు. మడకశిరలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుమ్మనూరు జయరాం, ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శంకర్ నారాయణ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లాలోని ముఖ్య నాయకులు సభలో పాల్గొంటారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనతోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రేణుక, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు నాసిర్, సింగల్ విండో అధ్యక్షుడు జయరామప్ప, జేసీఎస్ కన్వీనర్ మహేంద్రప్ప, శివన్న తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి కమ్యూనిటీ భవన ఆవరణలో మడకశిర నియోజకవర్గం పార్టీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్‌తో కలిసి మండల స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి, పరిశీలకులు పోకుల అశోక్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గత నాలుగున్నరేళ్ల పాలనలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిందన్నారు. వలంటీర్ల సహాయంతో ఇంటింటికీ లబ్ధి చేకూర్చడం జరిగిందని తెలిపారు. ఈనెల 7న మడకశిర నియోజకవర్గ కేంద్రంలో చేపట్టిన సామాజిక బస్సుయాత్రను సమన్వయంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు వారు లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, ఎంపీపీ కవిత, వైస్ ఎంపీపీ రత్నమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర, సింగిల్ విండో అధ్యక్షుడు మోతీరాంనాయక్, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్, ఎమ్మెల్యే తిప్పేస్వామి సమావేశమయ్యారు. ఈనెల 7న నిర్వహించనున్న బస్సు యాత్ర విజయవంతంపై వారు పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రాధమ్మ, నాగప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్, జేసీఎస్ మండల కన్వీనర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి భక్తరహళ్లి బ్రహ్మోత్సవాలు

- విజయవంతం చేయాలన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి


పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు తిప్పేస్వామి, శంకరనారాయణ

మడకశిర: మండలంలోని భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మడకశిరలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్‌తో కలిసి బ్రహ్మోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ ఈనెల 24 నుంచి వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. భక్తుల కోసం అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, పట్టణ అధ్యక్షుడు పుట్టకామప్ప, కౌన్సిలర్ అంజన్ తదితరులు పాల్గొన్నారు.

కనకదాస విగ్రహావిష్కరణ


భక్త కనకదాస విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పరిగి: మండలంలోని విట్టాపల్లిలో ఆదివారం కురుబల ఆరాధ్యదైవం భక్త కనకదాస విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అతిథిగా హాజరయ్యారు. తొలుత ఎమ్మెల్యేకు స్థానిక కురుబ సంఘం నాయకులు, నేతలు డప్పులు, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. భక్త కనకదాస చిత్రపటానికి పూలమాలలతో ప్రత్యేక పూజల అనంతరం కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు జ్యోతులను గ్రామంలో ఊరేగించి కనకదాస విగ్రహం వద్ద సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సవిత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, స్థానిక సచివాలయ కన్వీనర్ సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురునానక్ జయంతి


అన్నదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం: ప్రపంచంలో మానవులందరూ ఒకే కుటుంబమని అందరూ సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలని గురునానక్ చాటిచెప్పారని వక్తలు కొనియాడారు. గురునానక్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఈద్గాసర్కిల్ వద్ద సిఖ్ సత్ సంగత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏపీపీ ఇందాద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జబీవుల్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి, ప్రశాంతి మందిరం, వృద్ధాశ్రమం, ఈద్గా సర్కిల్ వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అన్ని మతాల పండుగలను సోదరభావంతో సామరస్యంగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో సిఖ్ సంగత్ మోహిందర్‌సింగ్, పలవీందర్‌సింగ్, భగవాన్‌సింగ్, జస్వంత్‌సింగ్, ఉమర్‌ఫరూక్, నాగరాజు, ఆంజనేయులు, ఉబేదుల్లా, షేక్షబ్బీర్, అజ్జు, అజమతుల్లా, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు వెళ్లి పింఛన్ అందజేత


పింఛన్ అందిస్తున్న వలంటీర్ పాండు

అగళి: మండల పరిధిలోని రామనపల్లి గ్రామానికి చెందిన గంగప్ప రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పింఛన్ ఇచ్చేందుకు వెళ్లిన వలంటీర్ పాండుకు స్థానికులు విషయం చెప్పారు. దీంతో అతను వెంటనే బెంగళూరుకు వెళ్లి గంగప్పకు పింఛన్ డబ్బులు అందజేశారు. దీంతో ఆయాన వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వాల్మీకిని ఆదర్శంగా తీసుకోవాలి


వాల్మీకి చిత్రపటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

అమరాపురం: సమాజంలో ప్రతి ఒక్కరూ వాల్మీకిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని వాల్మీకి పెద్దలు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పేలుబండ గ్రామంలో వాల్మీకి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 52 వాల్మీకి చిత్రపటాలతో చిన్నారులు, మహిళలు హారతులతో ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు.

ఓటరు నమోదు క్యాంప్‌లో 57 దరఖాస్తులు

లేపాక్షి: భారత ప్రధాన ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఫారం–6కు 39 దరఖాస్తులు, ఫారం–7కు 6, ఫారం–8కు 12 దరఖాస్తులు చొప్పున మొత్తం 57 దర ఖాస్తులు అందాయని తహసీల్దార్ బాబు పేర్కొన్నారు.

రొళ్ల: మండల వ్యాప్తంగా 32 బూత్ కేంద్రాల పరిధిలో ఆదివారం రెండో రోజు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి 92 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ హసీనాసుల్తానా తెలిపారు. అందులో ఫారం 6కి– 89, ఫారం –7కు రెండు, ఫారం – 8 ఒక దరఖాస్తు వచ్చాయన్నారు. అనంతరం రత్నగిరి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి


సోషల్ మీడియా సభ్యులతో ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్

హిందూపురం: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ తప్పుడు ప్రచారాలను దీటుగా తిప్పికొట్టాలని ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ సూచించారు. ఆదివారం స్థానిక టీచర్స్‌కాలనీలోని ఆగ్రోస్ చైర్మన్ ఆఫీసు వద్ద వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యుల ఆత్మీయ సమావేశం జరిగింది. నవీన్‌నిశ్చల్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల సందర్భంగా ఎల్లో మీడియా రాతలు, టీడీపీ నాయకుల అసత్యాలను నిగ్గుతేల్చి నిజాన్ని ప్రజల ముందు ఉంచడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి జనంలోకి తీసుకెళ్లాలన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

హిందూపురం టౌన్: హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో స్పెషల్ క్యాంపైన్ డేలో భాగంగా ఆదివారం పట్టణ, మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరేంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓల రిజిస్టర్‌ను పరిశీలించి పలు సూచనలు, సలహాలిచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా 253 పోలింగ్ కేంద్రాల్లో ఫారం–6 కింద 508 దరఖాస్తులు, ఫారం–7 కింద 108 దరఖాస్తులు, ఫారం–8 కింద 167 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ స్వర్ణలత తెలిపారు.